# ౧ పెనుమంచిలి జైన దేవుడు

నేను కొత్తగా పట్టపరీక్షిచ్చి ఆపైని విశ్రాంతికొరకుగాను ఒక చిన్న పల్లెటూరు వెళ్ళినాను.

పట్టపరీక్షకు నేఁదీసికొన్న ప్రత్యేకాంశము దేశచరిత్ర. దేశచరిత్ర నేర్వడంవల్ల రెండు సాధకాల కవకాశముంటుంది. ఒకటి "ప్రస్తుత పరిస్థితులకు పూర్వ మెుండేలాగుండేది ?" అని పరిశోధనచేసి యిదమిద్ధమని తేల్చుటకు; రెండు, "ప్రస్తుత పరిస్థితులనుండి ముందేస్థితి కొండుమారుచుండు ?" అని భావిని సూచించుటకు! అయితే వెళ్ళింది పల్లెటూరు. అదేంశిథిలమైన కోటలతోటి, పేటలతోటి, దేవళాలతోటి, దివ్యచెక్కడాలతోటి, రాగిశాసనాలతోటి, రాళ్ళమలపులతోటి ఉన్న పాడూరు కాదు. పోనీ ఆ పాడుదలనుబట్టి యెుకప్పుడీలా గుండేది యీ యూరని గతం ప్రతిపాదించడానికి. మఱి అదేం ఆకాశాన్నొరసి రారాపులాడిపోయే మేడలతోటి, మిద్దెలతోటి తులతూగుతూన్న నగరం కాదు, "ఈ పైని ఈలా మారగలదు" అని యేదో భవిష్యం విశదీకరించడానికి — అదో చిన్న పల్లెటూరు — సర్వసాధారణపు టిళ్ళు వాకిళ్ళు. ఆ యిళ్లైనా చెట్ల ముసుగులో అగపడకుండాఉండి, అసలక్కడో యూరున్నదన్నసంగతి యూహించడానికూడా సావకాశం కల్పించవివి. ఆ యూరి జనసంఖ్య ఆ యిళ్ళనుబట్టే ఉంటుందనుకోండి.

పరిమితం. కాని వీధిలో ఎప్పుడూ జనసంచారం మాత్రం కనబడుతుంది. ఏమాలంటే పరిమిత సంఖ్యాకులచే నివసింపబడే యూరైనా, ఆ యూరి వారి పనులు, అందరూ ఒకేగంటకు ప్రారంభించి యొకేగంటకు నిర్వర్తించుకోవాలనే నియామకంతో కూడుకున్నవి కావు. ఎవరిపని వారిది ఎవరి సమయం వారిది. రామ కోవెల అరుగులమీద కూర్చుంటే ఉదయమింకా తెలివేగు కాకుండానే ఒకరయితు కిర్రుచెప్పులతో నడవడం వినబడుతుంది. మరో నిమిషానికి అతని కెదురుగా వచ్చే యొకపశువు లాడగపిస్తాడు. ఇంకో నిమిషాని కింకో మనిషి, యింకో నిమిషాని కింకో మనిషి, ఇలా అస్తమానం ఎవరో యొకరు నడుస్తూనే యుంటారు వీధుల్లో. ఆ యూరికో చిన్న చెఱువుంది. చెఱువునిండా కమలాలే! చెఱువునిండా కలువలే! ఆ యూరి జనసంఖ్య అంతా పోగుచేస్తే 5, 6, వందలకంటె ఎక్కువుండదు. ఒక ఆడదీ యిప్పుడువచ్చి బిందె ముంచుకుని పావంచా లెక్కుతుంటే, యింకో ఆడుది పట్టిబిందె ఊచుకుంటూ మెట్లు దిగుతూంటుంది. రెండు జాముల పగటివేళైనా అక్కడే గొడ్లకాడ వాళ్ళోగూటేబిళ్ళ లాడుకుంటూ ఆ చెఱువుగట్టుమీద అగపిస్తూంటారు గాని అగపించక మానరు.ఇంతకూ చెప్పొచ్చేమాటేమిటంటే, ఆయూరంత చిన్నదైనా, అంత తక్కువ జనసంఖ్యతో కూడుకున్నదైనా, నిర్మానుష్యమైనదని, సందడి లేనిదని, అనుకోడానికి వీలులేదు. మఱీన్నీ ఊరే కనబడదని తొలుత తోసేసినా, చెట్ల మీదున్నకాకులను బట్టి, దూరానికి వినిపించే యొక్కొక్క మూల ఒక్కొక్క కుక్క మొఱుగును బట్టి, ఒక్కొక్క కోడిపుంజు కొక్కొరోకోని బట్టి కించిత్తు, కప్పులమీద పొగ నీలిమెలికలు తిరిగిపోయే అంతరాళపు జాడలను బట్టి, తెలిసికోవాలంటే, యూరుందని తెలిసికోవచ్చును.

కంకరవేసిన రోడ్డు ఆ యూరి కారు ఫర్లాంగుల్లో ఉంది. ఊరి లోనికి తిన్నగా రోడ్డునుంచి ఏ బండీ వెళ్ళదు. అంచేత రోడ్డుదగ్గర దిగి ఆ యూరికి నడిందారిని వెడుతూంటే మనకు నాగరిక ప్రపంచంతో సంబంధం వదలిపోయి నట్టుంటుంది. మన హృదయం మన మనస్సు అంతా ఖాళీ — మనం నేర్చుకొన్నది అక్కడ ఉపయోగించవలసిన అవసరముండదని కొంత కారణం, మనం నేర్చుకునేది అక్కడంతకన్నా యుండదని కొంతకారణం.

అటువంటి మాఱుమూల నున్న యూరును గుఱించి యింత మధురంగా వ్రాస్తున్న డెందు కీ లేఖరి అని చదువరుల్లో ఒకరనుకున్నా జవాబు చెప్పవలసిందేగా నేను—అది మా అత్తవారి యూరు— అందాకా వచ్చి పేరు దాచడం ఎందుకు ? — అది పెనుమంచిలి — నేను వెళ్ళిన ఊరే చెప్పానుగాని నేను వెళ్ళిన కాలం చెప్పలేదనుకుంటాను. అది వసంత కాలం. వసంతకాలంలోను వైశాఖమాసం. కన్నుల వైకుంఠంగా చెట్లు చిగురట్టి ఉన్నాయి. గంధర్వుల గానంలా కోయిలలు కూస్తున్నాయి. కొబ్బరి మట్లమీద, చింతచెట్లమీద, తాటి తోపుల్లోను, అక్కడక్కడ ఆకుపచ్చని చిలుకలు ఎఱ్ఱని ముక్కులతో కనబడుతున్నాయి. మేఘ మేదైనా మింట తెల్లగా నిలుచుండి పోయుంటే, క్రిందనున్న దేవుడిగుడి ధ్వజస్తంభాన్ని గాలిగంటలనే చూస్తూ, ఆ యెత్తే ఆ మేఘాన్ని మనం గుర్తించాలి గాని, దాని కద్దై మనచే గుర్తింపబడే అవసరం లేదు, అవకాశం లేదు.

* * *

ఊరిలో ఎవరింటికైనా ఎవరి అల్లుడైనా వచ్చినాడా అంటే పల్లెటి గ్రామాదుల్లో అదో వింతగా అతగాణ్ణి అంతా పలకరిస్తూ పరిచయం

కలగజేసికోవాలనే కుతూహలం కుఱ్ఱవాళ్ళ నుండి పెద్దవాళ్ళ వరకూ ఆ యూరి వారి కందఱికీ ఉంటుందని ఒకమాఱో మిత్రు డన్నాడు నాతో. అప్పట్లో నే నన్నాను "ఆఁ! ఊరందఱికీ ఉంటుందోయి? అజ్ఞారే! నీ భార్య కుండేని, నీ అత్తగారి కుండేని, నీ మామగారికి, నీ బావమఱుదు లకు ఉండేని" అని అన్నాను. కాని నేను నా అల్లునితనంకొద్దీ పైని వివరించిన పల్లియ ప్రవేశించునంత, ఒక్క మనుష్యులే కాకుండా రాయీ రప్ప, చెట్టు చేమా కూడా వింతగా నన్ను పలకరిస్తూన్నాయా అన్నంత ఇదిగా తోచినాయి. నా మిత్రుడు నిజం చెబితే నా అనుభవాన్ని బట్టి అతని మాట నిజంన్నరగా దోచింది.

మన దేశం నుంచి పరదేశం, అమెరికా వంటి దేశం, వెళ్ళినప్పుడు అక్కడ మన నాణాలన్నీ డోలర్ల క్రింద మార్చివేయబడి మన నాణాలు మన జేబులో ఉండనట్టే, అత్తవారి యూరుచేరే సందర్భంలో ప్రియుని భావాలన్నీ ప్రియురాలి రూపందాల్చి మూర్తీభవించి యుంటాయి—అతని మోమును జుట్టి యొక కళ ఆవరించి యున్నట్టే? — అల్లుని పేరుబెట్టి అల్లునెవరూ పిలవరు, ఫలాని అమ్మాయి మగడని ఏలుస్తారు గాని. ఆత్మీయమేమీ అగపించదక్కడ. అంతా ప్రియురాలినిబట్టి వచ్చేమెప్పే. తన కెప్పుడైతే అటువంటి అనుకోని మార్పు కలిగి పోయిందో, సమస్తం తనచుట్టూ మార్పునొంది తన యందెక్కడలేని మక్కువా, అందం, తాండవింప జేయుచున్నదీ అంటే ఆశ్చర్య మేముంటుంది? ఏమీ ఉండదు.

రోడ్డు దగ్గఱ బండి దిగి పొలం బాటనే నడుస్తూన్నప్పుడే అను కున్నాను నల్దెసలా పరకాయిస్తూ "ఏమి! నా ప్రియురాలీ వైపునకు తోడ బుట్టిన వానితో అక్కసెల్లెండ్రతో వచ్చి, తోటలోనో దొడ్డిలోనో యున్న కొబ్బరిచెట్ల కాయలు తీయిస్తూండ కూడదూ!" అని, ఇంకా కొంచెం

దూరం వెళ్ళి "ఉండకూడదూ ? నా ప్రియురా లా యీరబావి కడ తన తల్లి నీళ్ళు చేదుతూంటే తాను కంచె నున్న పచ్చగన్నేరు పువ్వులు పుణుకుతూ ?" నని, మఱి పొరుగిల్లు ఇరుగిల్లు దరిసేలో అనుకున్నాను "పెరుక్కు నేతికి తల్లి అంపితే నా ప్రియురా లో తప్పేలా పుచ్చుకొని అందులో డబ్బులు గలగల లాడించుకుంటూ గుమ్మంలోని రావిచెట్టు వేప చెట్టు జంట దిమ్మ దగ్గఱే నాకు తన దృక్కులతో స్వాగతమిస్తూ" నని— ఆ ఆసాసచూపుల్లో ఆ అనుకోవడంలో ఏ లోకం ఇంపుగా గనబడదు ! ఏ మోము అందగించదు !

నేను మామగారి యింటి వీధిగుమ్మం మెట్లెక్కాను. ఎవరూ యెదురురాలేదు—లోపలకు వెళ్ళాను—ఎవరూ రారు—గొంతు సకిలించేను. "ఎవరువారు ?" అని వంటింటిలోనుంచి మామగారి కేక వినబడింది. "నేను మరెవరూకాదులెండి" అని వంటింటి గుమ్మం కమ్మినాని తొంగిచూచాను. ఆయన కూడా కొంచెం యీవతలకు వచ్చి ఆనవాలు పట్టి "నాబాబు ! వచ్చినావోయి ? పరీక్షలో బాగా వ్రాసినావా ?" అని అడిగారు. ఆ వెనకాతలే అత్తగారు వస్తూ "కూరేం తరిగేది ? అని అంటే చెప్పడాని కింట్లోకి వచ్చినారు మీ మామగారు, ఆ మాయ సందణ్ణి నీ అడుగులజాడే గ్రహించలేక పోయినాను. అమ్మాయివాళ్ళూ ఆలా వెళ్ళారు కాబోలు" అని, 'కాళ్ళుకడుక్కో నాయనా !' అని నీళ్ళిచ్చి, కూర్చోమని పీటవేసినారు. నేనున్నూ కూర్చునే లోపుగా మామగారు వీధి గుమ్మం అమ్మట యిటూ అటూ తొంగిచూచి, వీళ్ళుకొత్తగా వెలిసిన జేనుదేవుణ్ని చూడడానికి వెళ్ళినట్లున్నారే !" అన్నారు. జేనుదేవుడని యనడంతోటే నాకో స్మృతితట్టి "ఎక్కడండీ అది ? నేనూ వెళ్ళిచూచి వస్తాను." అన్నాను. "సాయంత్రం చూడవచ్చునులే" అన్నారు మామ

గారు. కాని నాకేంతోస్తుంది ? మామగారు పెద్దలు నేను కుఱ్ఱవాణ్ణి, ఆయన మాటల ధోరణి వేఱు నా మాటలతీరువేఱు. ఎంతోదూరం లేక పోతే ఎంతసేపు ? వెళ్ళిచూచి నేనూ వాళ్ళూ కలిసివస్తాము" అన్నాను. "సరే ! అలా త్రోవ" అని నాకు పడమటిదిక్కు చూపించారు. తత్క్షణము ఆ దారినేవెళ్ళి చూచినాను.

× × ×

ఒక పెద్దరావిచెట్టు, రావిచెట్టు నిండాచిగురు. చెట్టు చిరకాలం క్రిందటిదైనా చిగురు నిన్నా మొన్నా వోసిందే ! ముసలివాళ్ళ రొదలా ధ్వనిలేదు. యువకుని కార్య శూరత్వమల్లే ధగ ధగమని పోతూంది. ఆ చెట్టు నీడలప్పటికి కొమ్మలురెమ్మలు మాత్రములై చిరుగాలి కాడుతూ క్రింది నేలనంతనూ మంత్రిస్తూ వున్నట్టున్నాయి. ఆ చెట్టు మొదటొక పెద్దరాతి విగ్రహం పద్మాసనం వేసికొన్నది యున్నది. నిడివీ వెడల్పూ గల కబంధము ! పెన్నొసలు ! కళాకాంతులున్న మొగము ! మొగా న్నిటూ అటూ పెద్దగాఁదూగే చెవులు.—కూర్చున్న పాళంగా విగ్రహము యొక్క యెత్తు చెట్టుయొక్క కనీసం అయిదారడుగులైనా ఆక్రమించు కొని యుంటుందని నా అంచనా. ఆ విగ్రహంచుట్టూ స్త్రీలూ, పురుషులూ పిల్లలూ, మూగి చిత్రచిత్రంగా చూస్తూన్నారు. విగ్రహం చెట్టు మొదట జేరగిల మోసి కనబడుతూంది.

ఆ విగ్రహాన్నంత దూరంనుంచి చూస్తూ మహావీర విగ్రహంగా పోల్చి, ఈ చిన్న పల్లియయొక్క ప్రేమస్వరూప మింత కాలానికి బయలు పడింది, దీనికో పూర్వచరిత్ర వాసన ఉన్న దనుకున్నాను.

ఆ జనం గుంపులోనుంచి క్రమక్రమంగా విడివడుతూ నాజతకత్తె నా వంకకు వచ్చీరానట్టుగావచ్చి "ఈ దివ్యవిగ్రహంకంటె దివ్యమాయగా బయలు పడినారుగా మీరు?" అంది సాభిప్రాయురాలై. అంటే "ఇప్పుడా?

# ఎప్పటిమాటో నా?

నీవనేది?" అన్నాను. ఊరుకుంది. జవాబు చెప్పలే.

లోతు నీళ్లో క్కొక్కప్పుడు పైకి దేన్నో ఓ చేపను మిలామిలా యెగరేస్తూన్నా లోతు లోతే; గట్టి ముత్యాల్నన్నింటినీ అట్టడుగునే యుంచుకుంటుంది. నే నడిగిన ప్రశ్నకు ప్రత్యుత్తర మీయకుండా అతి గంభీరంగా "చూచి రండి" అంది. సన్నగా గాలి నలుసుల్నీ వెలుగు నలుసుల్నీ పెనేసి పురెక్కించినంతట జిగిబిగిగా కనురెప్పల తాటింపు, పెదవు లాడింపు సమేలంజేసి యొక్కమాఱు గావించి అన్నట్టుంది ఆ మాట! ఆ సమయ మందా సొగసి! అంటూ తను తమ యింటివైపు వీధిమలుపే మాయమైపోయింది. తక్కంగల పిల్లకాయలు, కొందఱు స్త్రీలు, కొందఱు పురుషులు, యావన్మందీ ఓ ఘడియలో పలచబడ్డారు.

× × ×

ఎప్పుడన్నా ఆ యూరిలో ఇష్టా గోష్టినేదైనా ఒక బదనిక పెరిగిన పెద్ద జువ్వి చెట్టుగాని, ఊడలు దిగిన గొప్ప మఱ్ఱి చెట్టుగాని చూసి యీ చెట్టు వయసెంతుంటుందండీ అంటేజవాబు చెప్పలేకపోయినవాణ్ణి ఆ రాత్రి

చెక్కడం చూచినంత క్రీస్తు వెనుకటి పనిగాని యిప్పటిది గాదనే యూహ నిరాటంకంగా సాగించినాను. ఏమా అంటే చెట్టే యేటికాయేడే చిగురు పట్టి కాయలు కాచి, కొత్త బూరాలకూ కొత్త బువ్వం-బంతులకూ కొత్త యూఁగాయలకూ, అధారమౌతూంటుంది. పోనీ పడిపోయిన యేఏటి రాలికలను గుర్తించి వయస్సు కట్ట కూడదా అంటే రాలుటాకు లేవి ? అవి మఱుండవు. పల్లెటూరిలో మేకలు తినేసేవి. కొన్ని చెదరి యుంటే చెట్టు మొదటి కంటా ఊడ్చి, గోతిలో పూడ్చి, లేక మంటపెట్టి, గోష్పాదాన్నైనా గ్రుచ్చుకోకుండా, గలగలమనకుండా, ఉండేటంతనున్నగా ముష్టివాళ్ళు నష్టివాళ్ళు మటుమాయం చేస్తూంటారు. చెట్టంకచూస్తే చెట్టు నెప్పుడూ ఆకే. అందుచేత ఊరి వారితో "మీ యూరు పురాతనపుటూరు అని యిందు మొలచిన చెట్లను బట్టి నన్నొప్పించాలని చూస్తారుగాని అలా అంటే నేనొప్పను. మీ యూరే నాటి కానాడే క్రొంగ్రొత్త. దీని యందలి నిసర్గసృష్టి దుగ్ధము ఏరోజు కారోజు నవనవలాడుతూండే భావ నవనీతాన్ని చిలికిస్తూంటుంది" అని అనేవాణ్ణి; కాని ఆవిగ్రహాన్ని, ఆవిగ్రహం పైని ఆదిశేషు నాలికలల్లే ఆవరించి అల్లల్లాడే రావి కొమ్మల్ని, రావి కొమ్మలనీడల్ని అన్నింటినీ కలిపి సందర్శించి సమీకరణం చేసికోవడంలో "నే నెక్కడున్నాను? నేను వచ్చియున్న యీ యూరేనాటిది ? ఎవరిది ?" అనే భావమతి మాత్రమై మతి మురిపించింది, మతిమఱపించింది.

ఎవరో మా వదినెగారి వత్స అయియుంటాడు : వచ్చి, "తాతయ్యా స్నానం చేసి మడిగట్టుకొని నీ కోసం కనిపెట్టుకున్నాడు. బాబయ్యా ! నిన్ను రమ్మంటున్నాడు త్వరగా" అని కేకేసే వఱకు భోజనానికి వేళయిందనే యూహే పోలే. అంతవఱకు ఆ విగ్రహం దొఱకిన తావు, దాని

తవ్వి తీసిన కారణం, ఆ పరిసర ప్రాంతం, సమగ్రంగా వింటూ కంటూ, కాళ్లాన్ని నర్తిస్తున్నాను కాలం కాని మచ్చున.

× × ×

ఇంటి గుమ్మమెక్కుతూ, స్నానానికి లేస్తూ, మామగారు జపంలో ఉన్నారన్న సంగతి కూడా ఏమఱి, "మామగారూ ! మీ యూర బయలు పడ్డ విగ్రహం చాల పురాతనపుది. ఇప్పటి కిన్నూరు దశలు మున్నూరు దశల క్రీతపుద కావలెను. మీ యూరికి పెద్ద చరిత్ర ఉండీ యుంటుంది పరిశోధించే వారుంటే" అన్నాను. అయన మౌనంగా జపం చేసు కోవడంలో నాకు జవాబు చెప్పలేదుగాని, నా సహచరిణి నా వీపు తోముటకై వచ్చినట్లుగ వచ్చి, నా దిక్కు మొగంబై నూతి గోడను ఆని "అంతా కొత్తగా వెలిసిన దేవుడంటే మీరు ప్రాత విగ్రహం, రెండు మూడు వేల యేండ్ల క్రీతపుదనండి ! ఇదా మీ పరిశోధనా ! ఇంత సేపు మీ పరకాయింపూనూ ?" అంది.

నే నామె కళ్ళల్లోకి నా దో కన్ను విసరి, వంగుని, బిందెతో నీళ్ళు ముంచుకుంటూ "నూతన వధూవరులు, నూతన వధూవరులు అని పెళ్ళి కాలమందు అభినందిస్తూన్నా గాని దాంపత్యము పూర్వ జన్మ సుకృతమని, పూర్వ జన్మంలోని లక్ష్మీ నారాయణులే యిప్పుడీలా వెలిసినారని కాని యాడరూ ?" అన్నాను. అప్పటికప్పుడే తన దోసిట సబ్బు రుద్దుకుని సబ్బుబిళ్ళ నూతి గోడమీద పెట్టి, తన రెండు చేతులతో నా వీపున సబ్బు నురుగు పూస్తూ, "అవును లేండి

# ఎప్పటిమాటోనా?

అని మీరన్నప్పుడే నా హృదయంలో నుంచి వెలివడ్డ క్రొత్త ప్రశ్న పాతగిలిపోయి, పాతగిలిపోయి ఇందాకా సిగ్గుతో నన్నొత్తిగిల జేసింది" అంది. అప్పటి నీలో కళ అంతా నే చూఅగొన్నానులే?" అని "తువాలేదీ?" అన్నాను. "మూట కట్టుకోడానికా? తుడుచుకోడానికా? తుడుచుకోడానికైతే నే తుడుస్తున్నా" నని తువాలు తెచ్చి తుడుస్తూ "కళ మూట గడితే ఉండదు. తుడిస్తేనే ఉంటుంది" అంది. ఇంకా ఏంచెయ్య బోయిందో?—

మామగారి దేవతార్చన ఘంట గణగణ మంది. ఆయన శివపూజా ధురంధరులు.

---

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 6-12-1930 | పెనుమంచిలి | "సుధ"లో |